నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: కిష్టాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ మేడ్చల్ ఏఈ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీఏ కండ్లకోయ, సీమార్, ఐడీఏ మేడ్చల్, తునఫుడ్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాసర ట్రిపుల్ ఐటీకి గురుకుల విద్యార్థిని ఎంపిక


దేవికనందిని

కీసర: కీసరలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల (చారిమ్నార్) విద్యార్థిని ఆకుల దేవికనందిని బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో 581 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయులు ఆమెను ఈ సందర్భంగా అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


నర్సయ్య కాలనీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కీసర: 100 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని నర్సయకాలనీలో కమిషనర్ వెంకటర్‌రెడ్డి పర్యటించారు. కాలనీలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, వనమహోత్సవంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. డీఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలకు దారి ఏర్పాటు


రోడ్డును చదును చేయిస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా వంతెన ఐక్యకార్యాచరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి శనివారం జేసీబీ సాయంతో చదును చేయించారు. వంతెనకు ఇరువైపులా ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లేందుకు రోడ్డును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే వంతెన కారణంగా భూమిని కోల్పోతున్న బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, వంతెన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రమాదం.. ప్రయాణం !

● రోడ్డు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్ ● దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్న ప్రజలు ● పనులు పూర్తిచేయాలని కోరుతున్న వాహనదారులు


ఘట్‌కేసర్‌లో దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఘట్‌కేసర్: రోడ్ల విస్తరణలో భాగంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ యంనంపేట్ చౌరస్తా నుంచి స్థానిక మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు 100 ఫీట్ల విస్తరణతో రోడ్డు నిర్మించాలని కేంద్రం రూ. 300 కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్ల విస్తరణ చేయకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డునే తవ్వి కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

యంనంపేట్ నుంచి బస్టాండ్ వరకు ఇరువైపుల రోడ్డు తవ్వి పనులు చేయకుండా అసంపూర్తిగా కాంట్రాక్టర్ వదిలేశాడు. వాహన రాకపోకలతో దుమ్ము, ధూళి ప్రయాణికుల కళ్లు నిండిపోయి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు దిగి ఎక్కలేని దుస్థితి...

మెయిన్ రోడ్డు నుంచి కాలనీలకు వెళ్లే చిన్న రహదారులు ఫీటున్నర లోతు తవ్వడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివైడర్ లేని స్థలంలో ఇరువైపులా రోడ్ల మధ్య ఫీటు లోతు తేడా ఉంటుంది. దీంతో చిన్న వాహనాలతో రోడ్డు దిగి తిరిగి ఎక్కలేకపోతున్నారు. అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఆటోలు నిలపడంతో బస్సుల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు ఎక్కి దిగే క్రమంలో చాలామంది ప్రయాణికులు కిందపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. దీనికితోడు పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో పెద్దఎత్తున దుమ్ము ధూళీ రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యాపారాలు కుదేలు..

వాహన రాకపోకలతో దుమ్ము, ధూళితో వ్యాపారాలు కుంటుపడుతున్నాయి. ఫీటు లోతు ఉండటంతో పార్కింగ్ కోసం రోడ్డు దిగలేని దుస్థితి నెలకొని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. తినుబండారాలపై దుమ్ము పడుతుండటం గమనించి తినడానికి ఎవరూ ముందుకురావడం లేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి రోడ్డు పనులను పూర్తిచేసి దుమ్ము, ధూళీ నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

వ్యాపారం సాగడం లేదు...


రోడ్డు తవ్వి వదిలేయడంతో దుమ్ము, ధూళీ లేచి తినుబండారాలపై పడుతోంది. దుమ్ము పడిన ఆహారాన్ని తినేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో హోటల్ నడవడం లేదు.

– జగదీశ్‌గౌడ్, హోటల్ నిర్వాహకుడు

దుమ్ము, ధూళితో ఇబ్బందులు...


రోడ్డు తవ్వి కొద్దిపాటి మెటీరియల్ వేసి అలాగే వదిలేశారు. వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి వ్యాపార సముదాయాలు దుమ్ముతో నిండిపోతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి పనులను పూర్తి చేయాలి.

– సంజీవముదిరాజ్, వ్యాపారి ఘట్‌కేసర్

రోడ్డుపై ప్రయాణించలేకపోతున్నాం..


రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి గాలికొదిలేయడంతో ప్రయాణం ప్రమాదంలో పడింది. దుమ్ము,ధూళితో రోడ్డు మీద లేవడంతో ప్రయాణించలేక పోతున్నాం. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

– సురేష్, స్థానికుడు

వైభవంగా జగన్నాథ రథయాత్ర




రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్‌లో భక్తియోగ క్లబ్ ఆధ్వర్యంలో 9వ వార్షిక జగన్నాథ రథయాత్రను శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. యువతను ఆధ్యాత్మిక మార్గంలో ప్రేరేపించే ప్రముఖ వ్యక్తి అమోఘ్ దేశపతి ముఖ్యఅతిథిగా పాల్గొని రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుడు తనకు తానుగా బయలుదేరి అందరినీ తన కరుణతో ఆశీర్వదించడాన్ని రథయాత్ర సూచిస్తుందన్నారు. ఇస్కాన్ గ్లోబల్ డ్యూటీ ఆఫీసర్ రాధే శ్యామ్ ప్రభు ఆధ్యాత్మిక మార్గదర్శిగా వ్యవహరించారు. అనంతరం స్వామివారికి మహా హారతి, జగన్నాథుని అన్నప్రసాద వితరణ చేశారు.

మేడ్చల్: శ్రీకృష్ణ పరమాత్ముడి నామస్మరణతో మేడ్చల్ పులకరించింది. శనివారం నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. మేడ్చల్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్, బాలాజీనగర్, ఉమానగర్, జాతీయ రహదారి నుంచి ప్రధాన వీధుల గుండా రథయాత్ర సాగింది.

ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు చెందిన రమేష్ ఆర్థిక సమస్యల కారణంగా ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబీకుల విన్నపం మేరకు అతడి కుటుంబానికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. పేద కుటుంబం కావడంతో ఆదుకోవాలని మృతుడి భార్య అర్చన ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు విన్నవించింది. స్పందించిన ట్రస్ట్ సభ్యులు ఇద్దరు పిల్లల భవిష్యత్తుకు వారి పేరుపై పోస్టాఫీస్‌లో రూ.20 వేల నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు శనివారం అందజేశారు.

గుజరాత్ పశువైద్యుల బృందం సందర్శన

మేడ్చల్: గుజరాత్ పశువుల కంటే రాష్ట్రంలో పశువుల పాల ఉత్పత్తి తగ్గుదలను తెలుసుకునేందుకు గుజరాత్‌కు చెందిన పశువైద్యులు సందర్శించారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ సోమారంలో 1962 ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో గుజరాత్ పశువైద్యులు పశువులను పరిశీలించారు. మేకలు, గొర్రెలు బర్రెలను పరిశీలించి తగిన మందులు సిఫార్సు చేసి, పలు మందులను వేశారు. 1962 రాష్ట్ర ప్రాజెక్ట్ హెడ్ డాక్టర్ బగీషమిత్రా, గుజరాత్ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, మేజర్ అచిన్ అరోరా, డాక్టర్ చాన్‌పాషా, 1962 ప్రతినిధులు నాగేందర్, తిరుపతి, అనిల్, వీరయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కీసర: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని 'ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్' (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) సీఐటీయూ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాధ్యులు బంగారు నర్సింగ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రవాణా రంగం కార్మికులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 2019 మోటార్ వెహికల్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఆటో, ట్రాలీ, లారీ, డీసీఎం, బస్సు తదితర రవాణారంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు.

మేకల చోరీ.. కేసు నమోదు

అల్వాల్: మేకల కొట్టం నుంచి అర్ధరాత్రి మేకలు చోరీ అయిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలో నివసించే శ్రీకాంత్ మాంసం వ్యాపారి. కాగా తన దుకాణం పక్కనే మేకల కొట్టంలో మేకలు ఉంచాడు. శనివారం ఉదయం లేచి చూసేసరికి సుమారు 12 మేకలు కనిపించలేదు. సీసీ ఫుటేజీని పరిశీలించగా.. దుండగులు అర్ధరాత్రి బొలేరో వాహనంలో మేకలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు రోడ్ల నిర్మాణానికి తగిన చర్యలు


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: బొల్లారంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్‌లో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షులు రాజీవ్, కర్నల్ వినయ్‌కుమార్, కమాండింగ్ సురేష్‌లను శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఏవోసీ పరిధిలో అదనపు రోడ్ల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి సహకరించాలని ఆయన వారికి వినతిపత్రం అందజేశారు. రైల్వే అధికారులు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జగదీష్‌బాబు, మిలినియల్, బీఆర్‌ఎస్ నేతలు అరుణ్‌రావు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ధర్నా


ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కుషాయిగూడ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సకాలంలో రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. అనిల్, శ్యామ్, నారాయణ, భార్గవ్, రోహిత్, తిలక్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా..

ఉప్పల్: గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిరసన చేపట్టారు. సీఎం పదే పదే ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించినా.. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఫీజులు కట్టలేక యాజమాన్యాల ఒత్తిడి భరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన వ్యక్తం చేశారు. సాయిచరణ్, రాకేష్, రామ్, సురేష్ పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై స్పందించిన అటవీశాఖ

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్‌లో భారీ మర్రిచెట్టు, తాడిచెట్టును నరికివేసిన ఘటనపై మేడ్చల్ జిల్లా అటవీశాఖ అధికారులు స్పందించారు. శనివారం జిల్లా అటవీశాఖ అధికారి రేణుక, డిప్యూటీ రేంజర్ ఇంద్రసేనారెడ్డిలు శివసాయినగర్‌లోని నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించిన అధికారులు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా చెట్లను నరికివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. సీసీఎస్ అధ్యక్షుడు పద్మారెడ్డి, అశోక్, బింగి బిక్షపతి, సత్యనారాయణ, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రమేష్, గోపాలకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలుపై ఎన్ఎస్‌యూఐ ఆందోళన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో కండోనేషన్ ఫీజుల విషయంలో ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. పరీక్షలు రాసేందుకు అటెండెన్స్ లేదని చెబుతూ.. యాజమాన్యం విద్యార్థుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తుందని ఆరోపిస్తూ.. శనివారం కళాశాల వద్ద ఎన్ఎస్‌యూఐ నాయకులు విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తూ.. కళాశాల అద్దాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. కండోనేషన్ ఫీజుల విషయంలో శాంతియుతంగా మాట్లాడేందుకు వచ్చిన తమను యాజమాన్యం, సిబ్బంది రెచ్చగొట్టడం వల్లే అద్దాలు ధ్వంసం చేయాల్సి వచ్చిందని విద్యార్థి సంఘం నాయకులు తెలుపగా.. శాంతియుతంగా ఆందోళనలు, సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడకుండా దాడులకు దిగడం సరికాదని కళాశాల చైర్మన్ పేర్కొన్నారు.

విద్యార్థినులకు రూ.46 లక్షల భారీ ప్యాకేజీ


శృతి శ్రీశ్రావ్య

మేడ్చల్‌రూరల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉండగానే భారీ వేతన ప్యాకేజీతో ప్రఖ్యాత ఐటీ సంస్థ అమెజాన్ కంపెనీలో ఉద్యోగం సొంతం చేసుకున్నారు. కళాశాలలో సీఎస్ఈ చివరి సంవత్సరం చదువుతున్న శృతి, శ్రీశ్రావ్య రూ.46 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్లుగా నియమితులయ్యారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు అత్యున్నత వార్షిక వేతనంతో ప్రఖ్యాత సంస్థకు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల ప్రతిభ, అధ్యాపకుల అంకిత భావంతో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.



అ'పూర్వ' సమ్మేళనం

మేడ్చల్/మేడ్చల్‌రూరల్:ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒకే చోటుకు చేరారు. ఎంబీబీఎస్‌లో 2005లో వైద్య విద్యలో చేరి వైద్యులుగా వృత్తి నిర్వర్తిస్తున్న పూర్వ విద్యార్థులు పలు దేశాల్లో సేవలు అందిస్తున్నారు. 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కళాశాల ఆడిటోరియంలో అల్యూమి మీట్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రాకేష్‌రెడ్డి, యాజమాన్యం వారికి ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు, ప్రొఫెసర్ శివరామకృష్ణ పూర్వ విద్యార్థులు, వైద్య వృత్తి గురించి మాట్లాడారు. 20 ఏళ్ల తర్వాత ఒకే చోటుకి చేరడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. వైస్ ప్రిన్సిపాల్ శైలేంద్ర, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్

శామీర్‌పేట్: కార్పొరేట్ తరహాలో పాఠశాలకు మెరుగులు దిద్దుతూ.. సుందరీకరించడం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మరాశిపేట ప్రభుత్వ పాఠశాలలో ఏసీఆర్ అక్షీవ్ సంస్థ - హోవిన్‌హోలె స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆమె ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్, ఆర్‌వో వాటర్ ఫిల్టర్, కిచెన్ షెడ్, వాష్ ఏరియా, సైన్స్‌ల్యాబ్, రెండు గదులకు ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్, మలమూత్రశాలల నిర్మాణం, పాఠశాల భవనానికి పెయింటింగ్, రంగు రంగుల బొమ్మలతో ఆలంకరణలను ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందించగా.. తలుపులు, కిటికీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను సుందరీకరణకు సహకరించిన స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థల ప్రతినిధులు సాయి, నంది బృందం, ఉపాధ్యాయులు శ్రీదేవి, మాధవి, ప్రసాద్‌రావు, దినకర్, ప్రవీణ్, కుమార్, వెంకట్రామ్‌రెడ్డి, మహేష్, రాములు, గ్రామపెద్దలు ప్రభాకర్‌గౌడ్, సత్యనారాయణ, గీత మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఐడీ నెంబర్ !

ఆధార్ తరహాలో 11 అంకెల సంఖ్యతో గుర్తింపు కార్డు

- మండలంలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్
- గుర్తింపు సంఖ్య ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఘట్‌కేసర్ మండలంలో నమోదు వివరాలు..

మొత్తం రైతులు	: 7064
రిజిస్టర్ చేసుకున్నవారు	: 1326
రిజిస్టర్ చేసుకోవాల్సినవారు	: 5738
రైతుబంధు లబ్ధిదారులు	: 5094

పోచారం: పారిశ్రామిక, సాంకేతిక, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు గుర్తింపు కార్డులు ఉన్నట్లే అన్నదాతకు గుర్తింపుకార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీనిలో భాగంగా ఘట్‌కేసర్ మండల పరిధిలోని పోచారం మున్సిపాలిటీతో సహా అన్ని ప్రాంతాల్లో ఈసారి మే నెలలో «రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. ఫార్మర్ రిజిస్ట్రీ» కార్యక్రమాలను నిర్వహించారు. ఐడీ నెంబర్ ఉన్న రైతులే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులవుతారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీని ప్రారంభించింది.

11 అంకెలతో ఐడీ నెంబర్...

ఆధార్ నెంబర్ తరహాలోనే రైతులు అందరికీ 11 అంకెలతో గుర్తింపు సంఖ్య (ఐడీ నెంబర్)ను కేటాయించడమే ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ. ఐడీ నెంబర్ ఉన్న రైతులు వివిధ సంక్షేమ పథకాలకు అర్హులవుతారు. అందుకే ఈ గుర్తింపు సంఖ్య ప్రతీ రైతుకు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో సంబంధం లేకుండా కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాల కోసమే ఐడీనెంబర్ కేటాయిస్తున్నారు. అనంతరం ఐడీ కార్డులను నేరుగా రైతు చిరునామాకు పోస్టు ద్వారా అందజేసే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐడీ నెంబర్ ఎలా పొందాలి..?

మండలంలోని రైతుల వివరాలను సేకరించేందుకు వ్యవసాయశాఖ అధికారులు గ్రామస్థాయిలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోలేకపోతే వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, మొబైల్‌నెంబర్ వంటి ఆధారాలతో రిజిస్టర్ చేసుకుని ఐడీ నెంబర్ పొందవచ్చు. వివరాలు నమోదు చేస్తున్నప్పుడు రైతు మొబైల్‌కు మూడుసార్లు ఓటీపీలు వస్తాయి. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, ప్రస్తుతం నిర్ణీత గడువులేదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అన్నదాతకు అనేక పథకాలు...

అన్నదాతకు అండగా నిలిచేందుకు కేంద్రప్రభుత్వం ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తోంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా పెట్టుబడిసాయం, పంటల నష్టపరిహారం కోసం పీఎం ఫసల్‌బీమాయోజన, కిసాన్ క్రెడిట్‌కార్డు ద్వారా రైతులకు ఎలాంటి హామీ లేకుండా రుణాలు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, జల సంమృద్ధి యోజన అమలవుతున్నాయి. వీటితో పాటు నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ స్కీమ్, పీఎం క్రిషి సంచాయ్ యోజన, కుసుమ్ స్కీమ్, సీడ్ విలేజ్, సాయిల్ హెల్త్‌కార్డ్, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా ఫండ్ తదితర పథకాలు రైతులకు వెన్నుదన్నుగా నిలిచాయి. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను కేంద్రం అమలు చేసేందుకు రైతు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు.

రైతులకు ఇదో శుభ పరిణామం..


రైతులను గుర్తించి ఫార్మర్ ఐడీ నెంబర్ కేటాయించడాన్ని శుభపరిణామంగా భావిస్తున్నా. కేంద్ర ప్రభుత్వం అమలుచేసే రైతు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు గుర్తింపుకార్డు తీసుకుంటా. ఈ కార్డు గురించి తోటి రైతులకు తెలియజేస్తాను.

– రవికుమార్, రైతు, కొర్రెముల్

అందరికీ అవగాహన కల్పిస్తున్నాం..


ఘట్‌కేసర్ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతుల వివరాలను నమోదు చేసి ఐడీ నెంబర్ అందజేస్తున్నాం. ఫార్మర్ రిజిస్ట్రీలో డ్రాప్‌డౌన్ కింద మర్పల్లిగూడ చూపించడం లేదు. సమస్యను టెక్నికల్ బృందం దృష్టికి తీసుకెళ్లాం. ఫార్మర్ రిజిస్ట్రీ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలి.

– లావణ్య, మండల వ్యవసాయాధికారి, ఘట్‌కేసర్